## క్లుప్తంగా

### నేడు విద్యుత్ సరఫరా బంద్

ఖానాపూర్: మండలంలోని 33/11 కేవీ సబ్ స్టేషన్లలో నెలవారీ మరమ్మతుల నేపథ్యంలో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ రాంసింగ్ తెలిపారు. ఖానాపూర్, సుర్జాపూర్, కడెం, బెల్లాల్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతులతో పాటు ఫీడర్‌పై చెట్ల కొమ్మల తొలగింపు దృష్ట్యా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని.. సబ్‌స్టేషన్ల పరిధి ప్రజలు గమనించాలని కోరారు.
నర్సాపూర్(జి): మండలకేంద్రంలోని 33/11 కెవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ డి.శంకర్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నర్సాపూర్(జి), అంజనీతండా, కుస్లీ, రాంపూర్ రైస్‌మిల్లు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తామని.. వినియోగదారులు సహకరించాలని కోరారు.

### వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు


రమేశ్ (ఫైల్)

సోన్: మండలంలోని సంగంపేట గ్రామానికి చెందిన గజ్జల రమేశ్ (49) అదృశ్యం కాగా శుక్రవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై గోపి తెలిపారు. సంగంపేట్‌కు చెందిన రమేశ్ ఈనెల 10న రాత్రి 8 గంటలకు ఇంటి నుంచి బైక్‌పై బయటకు వెళ్లి తిరిగిరాలేదు. కుటుంబసభ్యులు, బంధువుల ఇళ్లల్లో వెతికినా ఆచూకీ దొరకలేదు. రమేశ్ భార్య గజ్జల లక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

### ఐఫోన్ చోరీ

నర్సాపూర్(జి): మండలంలోని రాంపూర్ గ్రామంలో కిరాణం నడుపుతున్న ఈజాప ప్రణీత్ ఐఫోన్‌ను ఓ దొంగ ఎత్తుకెళ్లిన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. ఉదయం దుకాణం వద్దకు గుర్తు తెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి వస్తువులు కావాలని అడుగగా ప్రణీత్ వాటిని తీసుకొచ్చేందుకు లోనికి వెళ్లి తీసుకొచ్చేసరికి కౌంటర్ వద్ద ఉన్న ఐఫోన్‌ను ఎత్తుకెళ్లి పారిపోయాడు. ఐఫోన్ విలువ రూ.లక్ష ఉంటుందని బాధితుడు తెలిపాడు. అతడు నర్సాపూర్(జి) పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై సాయికిరణ్ తెలిపారు.

### డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటుకు దరఖాస్తుల ఆహ్వానం

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాలో మత్తు పదార్థాల వినియోగం తగ్గింపు కోసం జాతీయ కార్యాచరణ ప్రణాళిక పథకం కింద నిర్మల్ జిల్లాలో డిస్ట్రిక్ట్ డీఅడిక్షన్ సెంటర్ ఏర్పాటు కోసం ఆసక్తి, అర్హత కలిగిన ఎన్జీవో సంస్థల నుంచి ప్రతిపాదనలు స్వీకరిస్తున్నట్లు ఇన్‌చార్జి సంక్షేమ అధికారి ఫైజాన్ అహ్మద్ తెలిపారు. ఈ–అనుధాన్ (http:// grants& msje. gov. in/ ngo& login) పోర్టల్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇత ర వివరాలకు జిల్లా సంక్షేమ అధికారి, మహిళ శిశు దివ్యాంగుల, వయో వృద్ధులు, ట్రాన్స్ జెండర్స్ సంక్షేమ శాఖ కార్యాలయంలో ఈనెల 30లోగా సంప్రదించాలని వివరించారు.

### 'రైతుభరోసా'కు దరఖాస్తు చేసుకోవాలి

నర్సాపూర్(జి): 5 జూన్ 2025 వరకు కొత్తగా పట్టా పాసుపుస్తకం పొందిన రైతులు రైతుభరోసా సాయానికి దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ రమ్య ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తు ఫారం, భూమి పాసుపుస్తకం, ఆధార్, బ్యాంక్ ఖాతా జిరాక్స్‌లను వ్యవసాయశాఖ కార్యాలయంలో ఈనెల 20లోగా అందించాలని కోరారు. రైతుభరోసా సాయం పొందేవారు దరఖాస్తు చేయవద్దని సూచించారు.

### ఆయిల్‌పాం సాగు చేయాలి

మామడ: ప్రభుత్వం ఆయిల్‌పాం సాగును ప్రోత్సహిస్తోందని.. ఈ పంట సాగుకు రైతులు ముందుకు రావాలని ఉద్యాన అధికారి మౌనిక అన్నారు. శుక్రవారం మండలంలోని న్యూసాంగ్వి గ్రామంలో ఆయిల్‌పాం సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఒక్కో మొక్క ధర రూ.193 ఉండగా.. రైతులకు సబ్సిడీపై రూ.20కే అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 90శాతం సబ్సిడీపై బిందుసేద్యం పరికరాలతోపాటు మొదటి నాలుగేళ్లు ఎకరాకు ఏటా రూ.4200 అందిస్తున్నామని.. సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

### విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణీ

సారంగపూర్: మండలకేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు శుక్రవారం ప్రిన్సిపాల్ శంకర్ పాఠ్యపుస్తకాలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ అధ్యాపకులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని ఉత్తమ ఫలితాలు సాధించాలని పేర్కొన్నారు. సిబ్బంది తదితరులు ఉన్నారు.
**లక్ష్మణచాందలో..**
లక్ష్మణచాంద: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శుక్రవారం అన్ని తరగతుల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్‌లను మాజీ జెడ్పీటీసీ రాజేశ్వర్ అందజేశారు. హెచ్‌ఎం రాజునాయక్, ఉపాధ్యాయులు హరిప్రసాద్, అశోక్, వినోద్, కుమార్, హంసలత, బాపురెడ్డి, శ్రీనివాస్ ఉన్నారు.

# ఆటపాటల బడి.. అంగన్‌వాడీ

- కొనసాగుతున్న ప్రత్యేక కార్యక్రమాలు
- చిన్నారులను చేర్పించేందుకు తల్లిదండ్రుల ఆసక్తి


ఖానాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది

కుంటాల: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పోషకాహారంతోపాటు ఆటపాటలతో పూర్వ ప్రాథమిక విద్య అందించేందుకు ప్రభుత్వం పకడ్బందీ చర్యలు తీసుకుంటోంది. మహిళా, శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో 'అమ్మ మాట–అంగన్‌వాడీ బాట'పేరిట ఈనెల 10 నుంచి 17 వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మూడేళ్లు దాటిన చిన్నారులను గుర్తించి అంగన్‌వాడీ కేంద్రాలకు రప్పించేందుకు ఐసీడీఎస్ సిబ్బంది అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. చిన్నారుల ఆరోగ్యం, పోషకాహారం, పూర్వ ప్రాథమిక విద్య, మానసికాభివృద్ధి, కథలు, కనీస విద్యా సామర్థ్యాలు పెంపొందించే ఉద్దేశంతో అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తున్నారు. జిల్లాలో భైంసా, ముధోల్, ఖానాపూర్, నిర్మల్ అనే నాలుగు ఐసీడీఎస్ ప్రాజెక్టులుండగా వాటి పరిధిలో 855 మంది అంగన్‌వాడీ టీచర్లు విధులు నిర్వర్తిస్తున్నారు.

**10 నుంచి ప్రారంభమైన కార్యక్రమాలు..**

అమ్మ మాట–అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా ఈనెల 10వ తేదీ నుంచి 17 వరకు గ్రామాల్లో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో 926 అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా వాటి పరిధిలో 57,385 మంది చిన్నారులు ఉన్నారు. ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించేలా అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది ర్యాలీలు తీస్తున్నారు.

- ఈనెల 10న కార్యక్రమం ప్రారంభం సందర్భంగా అంగన్‌వాడీ కేంద్రాలను అలంకరించారు. గ్రామాల్లో ర్యాలీలు తీసి అంగన్‌వాడీ కేంద్రాల్లో అందిస్తున్న చిన్నారుల తల్లిదండ్రులకు సౌకర్యాలను వివరించారు.
- ఈనెల11న మూడేళ్లు దాటిన చిన్నారుల ఇళ్లకు వెళ్లి వారి తల్లిదండ్రులను కలిసి అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించేలా అవగాహన కల్పించారు.
- ఈనెల 12న చిన్నారుల తల్లిదండ్రులు పోషణ్ అభియాన్, సిబ్బందితో కలిసి ర్యాలీలు తీయడం, అనంతరం పెరటితోటల పెంపకం గురించి వివరించారు.
- ఈనెల13న కేంద్రాల్లో పిల్లలకు అందించే పోషకాహారం, ఇంటికి పంపించే ఆహార పదార్థాల ప్రాధాన్యతను తల్లిదండ్రులకు తెలియజేయడం
- ఈనెల14న స్వచ్ఛ ఆరోగ్యం కార్యక్రమం పేరిట చెత్త, ఇతర వ్యర్థాలను తొలగించి పరిశుభ్రత ప్రాధాన్యతను వివరిస్తారు.
- ఈనెల16న గ్రామస్తులు, పెద్దల సమక్షంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు నిర్వహిస్తారు.
- ఈనెల 17న ఆటపరికరాలతో పూర్వ ప్రాథమిక విద్యను బోధించే తీరును వివరిస్తారు.

**చిన్నారుల భవితకు పునాది**



అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అమ్మ మాట –అంగన్‌వాడీ బాట కార్యక్రమాన్ని ప్రవేశపెట్టింది. మూడేళ్లు దాటిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాలకు తీసుకెళ్లి పోషకాహారం , పూర్వ ప్రాథమిక విద్య అందిస్తాం, కేంద్రాల్లో నేర్పే విద్య భవితకు పునాదిగా ఉంటుంది.
– మాధవ్‌రావు, రాజశ్రీ, భైంసా సీడీపీవో

**ఖానాపూర్‌లో ర్యాలీ..**

ఖానాపూర్: మూడేళ్లు దాటిన చిన్నారులను కేంద్రాలకు పంపించాలని శుక్రవారం పట్టణంలోని విద్యానగర్–2 అంగన్‌వాడీ కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. టీచర్ జ్యోతి, తదితరులు ఉన్నారు.

# భూభారతి చట్టంతో భూసమస్యలు పరిష్కారం

- అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


దస్తురాబాద్ : బుట్టాపూర్‌లో దరఖాస్తులు పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్


లోకేశ్వరం మండలం వాస్తాపూర్‌లో దరఖాస్తు స్వీకరిస్తున్న తహసీల్దార్ సర్ఫరాజ్

దస్తురాబాద్: భూసమస్యలు పరిష్కరించేందుకే ప్రభుత్వం భూభారతి చట్టం తీసుకొచ్చిందని అదనపు కలెక్టర్(రెవెన్యూ) కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. భూసమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో అధికారులకు దరఖాస్తులు అందించాలన్నారు. శుక్రవారం మండలంలోని బుట్టాపూర్ గ్రామంలో రెవెన్యూ సదస్సు పరిశీలించి పలు వివరాలు తెలుసుకున్నారు. తహసీల్దార్ విశ్వంభర్, డిప్యూటీ తహసీల్దార్ యాదవరావ్, సీనియర్ అసిస్టెంట్ సంతోష్, ఆర్ఐ ఆర్తి, తదితరులు పాల్గొన్నారు.
కడెం: భూసమస్యలున్న రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకుంటే క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరిస్తామని రెవెన్యూ అదనపు కలెక్టర్ కిశోర్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని పాండ్వపూర్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సుకు హాజరై మాట్లాడారు. ఈసందర్భంగా పలువురు రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించి వారి ఇబ్బందులను తెలుసుకున్నారు. ఇందులో డీటీ చిన్నయ్య, సిబ్బంది తదితరులున్నారు.
సోన్: భూసమస్యల పరిష్కారానికి రైతులు రెవెన్యూ సదస్సుల్లో దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కూచన్‌పల్లిలో తహసీల్దార్ మల్లేశ్‌రెడ్డి, కడ్తాల్‌లో నాయబ్ తహసీల్దార్ జ్యోతి ఆధ్వర్యంలో భూభారతి సదస్సులు నిర్వహించారు. ఆయా గ్రామాల్లో 44 దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ అలీ మున్నీసా, కార్యదర్శి అశోక్, తదితరులు పాల్గొన్నారు.

**దరఖాస్తుల స్వీకరణకే సదస్సులు**

ఖానాపూర్: మండలంలోని తర్లపాడ్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులో 32 దరఖాస్తులు వచ్చినట్లు తహసీల్దార్ సుజాత అన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సత్యనారాయణ, సిబ్బంది ఉన్నారు.
లోకేశ్వరం: మండలంలోని వాస్తాపూర్, పోట్‌పల్లి(ఎం) గ్రామాల్లో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. వచ్చిన 66 దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తహసీల్దార్ సర్ఫరాజ్ అహ్మద్‌కు అందజేశారు. కార్యక్రమంలో డీటీ రవీందర్, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.
బాసర: మండలకేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం రెవెన్యూ సదస్సు ఏర్పాటు చేసి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించినట్లు తహసీల్దార్ పవన్‌చంద్ర పేర్కొన్నారు.సోమవారం నుంచి వారంరోజులపాటు తహసీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సు నిర్వహిస్తామని పేర్కొన్నారు. డిప్యూటీ తహసీల్దార్ ప్రకాశ్, ఆర్ఐ అభిమన్యు, రెవెన్యూ సిబ్బంది చరణ్, రజిత, నాయకులు రాజేందర్, మారుతి పటేల్ జాదవ్, ప్యాట్ల సుఖేశ్ రావు, కొటారి భూమన్న, నాగరాజు, భాస్కర్ ఉన్నారు.

# పాఠశాలల్లో సామూహిక అక్షరాభ్యాసాలు


ఖానాపూర్ బాలుర ఆశ్రమ పాఠశాలలో సరస్వతీదేవి చిత్రపటం వద్ద చిన్నారులు


మామడ మండలం పరిమండల్ పాఠశాలలో అక్షరాభ్యాసం చేసిన విద్యార్థులు


సోన్: మాదాపూర్ ప్రాథమిక పాఠశాలలో అక్షరాభ్యాసం చేయిస్తున్న ఉపాధ్యాయులు

ఖానాపూర్: మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో శుక్రవారం సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. ఖానాపూర్‌లోని బాలుర గిరిజన ఆశ్రమ పాఠశాలలో, కాంప్లెక్స్ పరిధిలోని అడవి సారంగాపూర్, సింగాపూర్ గోండుగూడ, సేవ్యానాయక్ తండా గ్రామాల్లో అక్షరాభ్యాస కార్యక్రమం ఏర్పాటు చేశారు. హెచ్‌ఎం ఎంఏ గఫార్ పర్యవేక్షించారు. దిలావర్‌పూర్ ప్రభుత్వ పాఠశాలలో హెచ్‌ఎం రాఘవేంద్ర విద్యార్థులకు పలకలు పంపిణీ చేశారు.
సోన్: బడిబాటలో భాగంగా మండలంలోని మాదాపూర్ ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులకు శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. ఈసందర్భంగా హెచ్‌ఎం శిరీష చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్ వాణి ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
దస్తురాబాద్:మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులకు శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. తహసీల్దార్ విశ్వంబర్ విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాం అందించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమేశ్, హెచ్‌ఎం కోట వేణు, ఉపాధ్యాయులు కొమురయ్య, షరీన్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.
భైంసారూరల్: మండలంలోని పేండ్‌పెల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో చేరిన విద్యార్థులకు శుక్రవారం ఉపాధ్యాయులు అక్షరాభ్యాసం చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అమృతం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.
కుంటాల: మండలంలోని కల్లూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్ రావు, ఉపాధ్యాయులు పద్మలత, సుజాత, బరుకుంట నవీన్, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, రాజమణి తదితరులు పాల్గొన్నారు.
ముధోల్: మండలంలోని బ్రహ్మణ్‌గావ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం చిన్నారులకు అక్షరాభ్యాసం నిర్వహించారు. సరస్వతీ అమ్మవారి చిత్రపటానికి పూజలు చేసి పలకలు అందజేశారు. ఉపాధ్యాయులు భాస్కర్, మారుతి, మల్లారెడ్డి తదితరులున్నారు.
లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులతో హెచ్‌ఎం రాజేశ్వర్ పలకపై అక్షరాలు దిద్దించారు. ఉపాధ్యాయులు నాగభూషణం ఉన్నారు.


కుంటాల మండలం కల్లూరులో..

మామడ: మండలంలోని పరిమండల్ ఉన్నత పాఠశాలలో సరస్వతిదేవి విగ్రహానికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. హెచ్‌ఎం మహేశ్ మొదటి తరగతిలో చేరిన చిన్నారులతో అక్షరాలు దిద్దించారు. ఉపాధ్యాయులు, అంగన్‌వాడీ సిబ్బంది, తల్లిదండ్రులు పాల్గొన్నారు. మండలంలోని ఆరెపల్లి, కొరటికల్ ప్రాథమిక పాఠశాలల్లో ఎంఈవో వెంకటరమణారెడ్డి అక్షరాలు దిద్దించారు.
బాసర: మండలకేంద్రంలోని రవీంద్రపూర్ ప్రాథమిక పాఠశాల చిన్నారులకు శ్రీజ్ఞాన సరస్వతి అమ్మవారి సన్నిధిలో అర్చకులతో అక్షరాభ్యాసం చేయించారు. హెచ్‌ఎం మమ్మాయి శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 'పెన్షనర్ల పాలిట ఆశనిపాతం' ఆవిష్కరణ


కరపత్రాలతో పెన్షనర్ల సంఘం సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: జిల్లాకేంద్రంలోని పెన్షనర్ సంఘ భవనంలో శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నిర్మల్‌శాఖ ఆధ్వర్యంలో 'పెన్షనర్ల పాలిట ఆశనిపాతం'అనే నినాదంతో కూడిన కరపత్రాన్ని సంఘ ప్రతినిధుల సమక్షంలో విడుదల చేశారు. పెన్షనర్ల సమస్యలు తెలిసేలా ముద్రించిన వినతిపత్రాలు ఈనెల 23న దేశవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్ల ద్వారా ప్రధానికి తెలిసేలా ఈ కార్యక్రమం చేపట్టినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పెన్షనర్ల సంఘం జాతీయ కార్యదర్శి ఎంసీ లింగన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.హనుమంత్‌రెడ్డి, యూనిట్ బాధ్యులు విలాస్, జనార్దన్, రమేశ్, జనార్దన్, పోతన్న, కిషన్‌రావు, పోశెట్టి, గంగాధర్ పాల్గొన్నారు.

### బాల్యవివాహాలు చేయొద్దు

భైంసారూరల్: మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో విజన్ సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం బాల్యవివా హా లపై అవగాహన కల్పించారు. విజన్ సంస్థ సభ్యులు అనురాధ మాట్లాడుతూ బాల్యవివా హాలు చట్టరీత్యా నేరమని.. నిర్ణీత వయసు దాటకుండా పెళ్లి చేస్తే బాలికలు అనారోగ్యం బారిన పడతారని పేర్కొన్నారు. అనంతరం బాల్యవివాహాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కవిత, కార్యదర్శి గాయత్రి పాల్గొన్నారు.

### సమష్టి సహకారంతో ఆలయ అభివృద్ధి

ఖానాపూర్: సమష్టి సహకారంతోనే ఆలయ అభివృద్ధి సాధ్యమని శివాజీనగర్ కాలనీ శ్రీ మహాలక్ష్మి ఆలయ కమిటీ సభ్యులు అన్నారు. పట్టణంలోని శివాజీనగర్ కాలనీ శ్రీ మహాలక్ష్మి ఆలయ ఆవరణలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో 2024కు సంబంధించిన జమ, ఖర్చులను చర్చించారు. సమావేశంలో కమిటీ సభ్యులు బక్కశెట్టి లక్ష్మణ్, కారింగుల రాములు, గాండ్ల నర్సయ్య, వెంకటప్పయ్య, గుగ్గిల్ల రాజేందర్, శ్రీనివాస్, శంకర్, రాజన్న పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లు నాణ్యతతో నిర్మించాలి


కోలూరులో ముగ్గుపోస్తున్న అధికారులు

లోకేశ్వరం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలని ఎంపీడీవో వెంకటరమేశ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మన్మద్ గ్రామంలో లబ్ధిదారులు నిర్మించుకునే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మార్కౌట్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. విడతల వారీగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో బిల్లులు జమ చేస్తామన్నారు. మాజీ ఎంపీపీ లలిత, నాయకులు భోజారెడ్డి, రాములు తదితరులు ఉన్నారు.
ఖానాపూర్: మండలంలోని కొత్తపేట గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు, ఇందిరమ్మ ఇళ్ల కమిటీ సభ్యులు మల్లయ్య, రాజలింగు, రాజన్న, గంగన్న, శంకర్, రమేశ్, అబీబ్ హైమద్ తదితరులు ఉన్నారు.
తానూరు: మండలంలోని కోలూరు గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. సీనియర్ అసిస్టెంట్ అనంత విశ్వేశ్వర్‌రావు, పంచాయతీ కార్యదర్శి తిరుపతిరెడ్డి తదితరులున్నారు.
నర్సాపూర్(జి): మండలంలోని టెంబుర్ని గ్రామంలో 26 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరవగా శుక్రవారం రెండు ఇళ్లకు అధికారులు మార్కౌట్(ముగ్గు) వేశారు. కార్యక్రమంలో ఎంపీఓ తిరుపతిరెడ్డి, హౌసింగ్ ఏఈ తనూజ, కార్యదర్శి శైలజ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా గంగమ్మతల్లి పండుగ


సల్లముంతలతో ఊరేగింపుగా వస్తున్న సభ్యులు

ఖానాపూర్: పట్టణంలోని గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం గంగమ్మతల్లి పండుగ నిర్వహించారు. ఏటా వర్షాకాలంలో ప్రధాన రహదారిపై గొల్లెన(వల)తో గంగపుత్ర సంఘం సభ్యులు ఊరేగింపుగా సల్ల ముంతలతో వెళ్లి గంగమ్మతల్లికి పూజలు చేస్తారు. అందులో భాగంగా పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ నుంచి గోదావరి తీరం వరకు డీజే చప్పుళ్ల మధ్య ఊరేగింపు నిర్వహించారు. అనంతరం గోదావరి తీరం వద్ద అందరూ చల్లంగా ఉండాలని పూజలు చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# మంత్రి జూపల్లిని కలిసిన నాయకులు


మంత్రికి మొక్క అందిస్తున్న నారాయణ్‌రావు

భైంసాటౌన్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నియమితులైన జూపల్లి కృష్ణారావును హైదరాబాద్‌లో కాంగ్రెస్ పార్టీ ముధోల్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నారాయణ్‌రావు పటేల్ కలిశారు. శాలువాతో సన్మానించి పూల మొక్క అందించారు. నియోజకవర్గంలోని సమస్యలు వివరించి, పరిష్కారానికి సహకరించాలని మంత్రిని కోరగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు మాజీ ఎమ్మెల్యే పేర్కొన్నారు.
లక్ష్మణచాంద: ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావును శుక్రవారం హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మండల నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నరేశ్‌రెడ్డి, కిరణ్ ఠాకూర్ తదితరులు పాల్గొన్నారు.

# పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

- డీఎంహెచ్‌వో రాజేందర్


నిర్మల్‌లో పరిశుభ్రత పాటించాలని స్థానికులకు సూచిస్తున్న డీఎంహెచ్‌వో రాజేందర్


కుంటాల : ఓలాలో శానిటేషన్ చేస్తున్న సిబ్బంది

నిర్మల్‌చైన్‌గేట్: వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో దోమల నివారణకు పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ రాజేందర్ సూచించారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని జవహర్‌నగర్‌లో జరుగుతున్న డ్రైడే కార్యక్రమాన్ని పరిశీలించారు. ప్రతీ శుక్ర, మంగళవారం పకడ్బందీగా నిర్వహించాలన్నారు. దోమలతో వ్యాపించే వ్యాధులు, కాలానుగుణంగా వ్యాపించే వ్యాధుల గురించి అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని సిబ్బందిని ఆదేశించారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆరోగ్య పర్యవేక్షకులు భోజారెడ్డి , ఆరోగ్య సహాయకులు సాయినాథ్, ఆశ, అంగన్‌వాడీ కార్యకర్తలు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

**పారిశుధ్య పనులపై దృష్టి సారించాలి**

తానూరు: వ్యాధులు ప్రబలకుండా పారిశుధ్య పనులపై దృష్టి సారించాలని మండల ప్రత్యేకాధికారి శ్రీనివాస్ సూచించారు. తానూరు గ్రామపంచాయతీ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శుల సమావేశంలో మాట్లాడారు. వర్షపునీరు నిలిచి దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మురుగు కాల్వలను శుభ్రపరిచి గ్రామస్తులకు క్లోరినేషన్ నీటిని అందించాలని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులతో పనులు ప్రారంభించేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో నసీరొద్దీన్ తదితరులు ఉన్నారు.
కుంటాల: డ్రై డే సందర్భంగా మండలంలోని ఓలా తదితర గ్రామాల్లో పారిశుధ్య పనులను ఎంపీడీవో లింబాద్రి పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీవో రహీంఖాన్, పంచాయతీ కార్యదర్శులు, ఏఎస్‌ఎం, ఆశవర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

# 'ముస్లింలకు మంత్రివర్గంలో చోటు కల్పించాలి'

నిర్మల్‌టౌన్: రాష్ట్ర మంత్రివర్గంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముస్లింలను చోటు కల్పించకుండా చిన్నచూపు చూస్తుందని బీఆర్‌ఎస్ నాయకులు రిజ్వాన్‌ఖాన్, ఖాజా అక్రమ్ అలీ ఆరోపించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని బీఆర్‌ఎస్ కార్యాలయంలో వారు మాట్లాడారు. మంత్రివర్గ విస్తరణలో ఒక్క ముస్లింకు కూడా చోటు దక్కలేదని మండిపడ్డారు. దీనిపై కాంగ్రెస్ అధిష్టానం ఆలోచించాలని కోరారు. బీఆర్‌ఎస్ నాయకులు మహమ్మద్ నయీమ్, మసూద్ ఖాన్, షేక్ మహబూబ్, జుబేర్ ఉన్నారు.

# ప్రభుత్వ కళాశాలల్లో అడ్మిషన్లు పెంచాలి


మాట్లాడుతున్న బోర్డు కార్యదర్శి భీంసింగ్

భైంసాటౌన్/దిలావర్‌పూర్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యార్థుల ప్రవేశాలు పెంచాలని ఇంటర్ బోర్డు సంయుక్త కార్యదర్శి భీంసింగ్ అన్నారు. భైంసా, దిలావర్‌పూర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలను శుక్రవారం సందర్శించారు. డీఐఈవో పరశురాంతో కలిసి అధ్యాపకులతో సమావేశం నిర్వహించారు. పదో తరగతి పూర్తయిన విద్యార్థుల ఇళ్లకు వెళ్లి ప్రభుత్వ కళాశాలల్లోనే చేరేలా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ కళాశాలల్లో అందిస్తున్న నాణ్యమైన విద్య, ఉచిత పాఠ్యపుస్తకాలు, తదితర అంశాలను తెలియజేయాలని సూచించారు. కళాశాలలో అధ్యాపకులు సైతం విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలన్నారు. అనంతరం శిథిలావస్థకు చేరిన తెలుగు మీడియం కళాశాల భవనం పరిశీలించారు. తరగతి గదుల్లో పైకప్పు పెచ్చులూడుతుండడం, నీరు ఉరుస్తుండడంతో భవన నాణ్యతపై ఆర్అండ్‌బీ ఇంజినీర్లకు లేఖ రాయాలని ప్రిన్సిపాళ్లు శివరంజని, సత్యపాల్‌రెడ్డికి సూచించారు. జిల్లా మానిటరింగ్ అధికారి సత్యపాల్‌రెడ్డి, అధ్యాపకులు ఉన్నారు.